

ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రజా సేవ చేయడమే తమ లక్ష్యమని వైసిపి మైనార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు బేపారి మహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని బండ్లపెంట, కొత్తపల్లె, ట్రంక్‌రోడ్డు ప్రాంతాల్లోని రెండు వేల పేద కుటుంబాలకు దుస్తులు పంపిణీ చేశారు. ఏటా రంజాన్ పండుగ సందర్భంగా మైనార్టీ సీనియర్ నాయకులు బషీర్‌ఖాన్ ఆధ్వర్యంలో ఆయన తనయుడు బేపారి మహ్మద్‌ఖాన్ పేదలకు దుస్తులు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది పేదలకు పంపిణీ చేశారు. ఏటా రంజాన్ మాసం పురస్కరించుకుని పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరంగా ఉందని మహ్మద్‌ఖాన్ చెప్పారు. కార్యక్రమంలో వైసిపి మైనారిటీ నాయకులు బేపారి జబివుల్లా ఖాన్, కొత్తపల్లె ఇంతియాజ్, బేపారి అసద్ ఖాన్ పాల్గొన్నారు.



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న మహ్మద్‌ఖాన్



కార్యకర్తలకు అండగా ఉంటా

- సమర్థులకే నాయకత్వ బాధ్యతలు
- స్టీల్‌ప్లాంట్ శంకుస్థాపనలపై ఎద్దేవా
- చక్కెర, పాల కర్మాగార పునరుద్ధరణేదీ?
- జోన్-5 సమీక్షా సమావేశంలో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/కడప అర్బన్

సమర్థ కార్యకర్తలను గుర్తించే బాధ్యత నాదని, క్షేత్రస్థాయిలో ఓట్లు తెచ్చే బాధ్యత మీరు తీసుకోవాలని కార్యకర్తలనుద్దేశించి మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మంగళవారం కడప నగరంలోని పుత్తా ఎస్టేట్‌లో జోన్-5 సమీక్షా సమావేశానికి హాజరై మాట్లాడుతూ జోన్‌ల వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ పార్టీని సంస్థాగతమైన అసెంబ్లీ, క్లస్టర్, యూనిట్, మండల వారీగా బలోపేతం చేయడంపై దృష్టి సారించామన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని 100 మందికి ఇద్దరు సాధికార సారథులను నియమిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన నిరసన పిలుపు, ఇంటింటికీ క్యాంపెయిన్, బాదుడేబాదుడు, ఇదేమి ఖర్మ వంటి నిరసన కార్యక్రమాల్లో పనితీరును రివ్యూ చేశామని తెలిపారు. జోన్-5లోని 35 అసెంబ్లీల పరిధిలోని ప్రొద్దుటూరు, కల్యాణదుర్గం, రాప్తాడు నియోజకవర్గాల్లో మెరుగైన పనితీరు కనిపిస్తున్న నేపథ్యంలో ఇన్‌ఛార్జులు అనుభవాలను తెలియజేయాలన్నారు. కడప స్టీల్ ప్లాంట్‌కు మూడు శంకుస్థాపనలు చేయడమేమిటని ప్రశ్నించారు. సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ చిరునామా నిలిచిందని చెప్పారు. టిడిపి హయాం నాటి రంజాన్‌తోఫా, పండుగ కానుకలు, విదేశీవిద్య, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ వంటి సంక్షేమాన్ని నిర్వీర్యం చేశారన్నారు. అప్పటి ప్రతిపక్ష నాయకుని హోదాలో ఇప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపట్టిన పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలైన చెన్నూరు చక్కెర, ప్రొద్దుటూరు పాల కేంద్రం పునరుద్ధరణ సంగతేమిటని నిలదీశారు. అనంతరం ఇటీవల కడప పార్లమెంట్ ఐటిడిపి ప్రధాన కార్యదర్శి నరసింహులు ప్రమాదంలో మృతి చెందిన నేపథ్యంలో ఆయన భార్యకు రూ.9 లక్షల చెక్కును అందజేశారు. పెద్దదర్గాలో ప్రార్థనల అనంతరం ఇఫ్తార్ విందుకు హాజరై ప్రసంగించారు. సమీక్షా సమావేశంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, కడప, నంద్యాల, కర్నూలు, హిందూపురం, అనంతపురం జిల్లాలకు చెందిన అధ్యక్షులు, 35 నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు, ఎమ్మెల్సీలు రామ గోపాల్‌రెడ్డి, బిటి నాయుడు, పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్, శ్రీనివాసరెడ్డి, కాలువ శ్రీనివాసులు, మాజీ మంత్రి అమర్ నాథ్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పేర్ల పార్థసారధిరెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి అమీర్‌బాబు, పుత్తా నరసింహారెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, ప్రవీణ్‌కు మార్‌రెడ్డి, భూపేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వరద రాజులరెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు బచ్చల పుల్లయ్య, శివనాథరెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షులు ఝాన్సీ, జిల్లా నాయకులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, జంబాపురం రమణారెడ్డి, ముక్తియార్‌తోపాటు పెద్దఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.



పెద్దదర్గాకు పూల చాదర్‌ను తీసుకొస్తున్న చంద్రబాబునాయుడు

ఎప్పుడు ఎన్నికలొచ్చినా గెలుపు టిడిపిదే : అచ్చెన్నాయుడు

రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా గెలుపు టిడిపిదేనని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెం నాయుడు అన్నారు. మంగళవారం పుత్తా ఎస్టేట్లో జోన్ 5 సమావేశం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి వై.ఎస్. జగన్‌లాంటి దుర్మార్గపు సిఎంను చూడలేదని పేర్కొన్నారు. వైసిపిలాగా తెలుగుదేశం పార్టీ గాలికి పెట్టిన పార్టీ కాదని తెలిపారు. విశ్వవిఖ్యాత నట సార్వ భౌమ ఎన్ టి రామారావు స్థాపించిన పార్టీ అని అన్నారు. ముఖ్యమంత్రి ఇడుపులపాయలో నోట్ల కట్టలు పాతిపెట్టారని, ఆ కట్టలు ఎన్నిక లప్పుడు బయటకు తీసి గెలవాల నుకుంటున్నారని విమర్శించారు. గతంలో కోడి కత్తి ద్వారా సానుభూతి పొందాలనుకుంటే కుదరక, సొంత బాబాయిని చంపి జగన్మోహన్ రెడ్డి ముందుకొచ్చారని ఆరోపించారు. వివేకా హత్యకేసులో అనుమానితుడుగా ఉన్న ఆయన తమ్ముడు అవినాష్ రెడ్డి, నిందితులుగా ఉన్న వారి ఆడవాళ్లతో వివేకాకు సంబంధాలు అంటగట్టడం విచారకరమన్నారు. టిడిపి పోలిటి బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కాల్వ శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి ప్రసంగిస్తూ 40 సంవత్సరాల వైఎస్ కుటుంబ పాలనలో జిల్లాకు ఒరిగింది ఏమీ లేదని విమర్శించారు.

భూ పరిహారం పంపిణీకి చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

మదనపల్లి-పీలేరు జాతీయ రహదారి -71కు సంబంధించి త్వరితగతిన భూపరిహారం పంపిణీ చేయాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్‌హాల్లో మదనపల్లి నుండి పీలేరు వరకు చేపట్టిన జాతీయ రహదారి-71 భూ పరిహార పంపిణీ అంశంపై ఆర్ డిఒలు, జాతీయ రహదారి అధికారులు, సంబంధిత తహశీల్దార్లతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మదనపల్లి- పీలేరు వరకు చేపట్టిన జాతీయ రహదారికి అవసరమైన భూ సేకరణ చేశారని చెప్పారు వారంలోగా భూ పరిహార పంపిణీ పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పీలేరు ప్రజలు బైపాస్ రోడ్డు త్వరగా ప్రారంభం చేయాలని కోరుతున్నారని, ఆదిశగా అధికారులు భూ పరిహార పంపిణీ త్వరగా పూర్తిచేసి ల్యాండ్‌ను ఎన్‌హెచ్ అధికారులకు అప్పజెప్పాలని ఆదేశించారు. సదరు భూమిని అప్పజెప్పిన వెంటనే యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించాలన్నారు. పరిహారం చెల్లింపునకు సంబంధించి తహశీల్దార్ల వద్ద ఫైల్స్ పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడూ పంపించాలని సూచించారు. రెవెన్యూ రికార్డులో ప్రకారంగా వివరాలు పక్కాగా ఉంటే వెంటనే పరిహారం పంపిణీ చేయాలన్నారు. ఎక్కడ కూడా ల్యాండ్ అక్వేషన్స్ పెండింగ్‌లో ఉండకూడదు అన్నారు. ఇంకను పరిహారం చెల్లించాల్సిన వివరాలను, సదరు డాక్యుమెంట్స్ ను పక్కాగా రూపొందించాలని చెప్పారు. ములకలచెరువు నుంచి మదనపల్లె వరకు జాతీయ రహదారి (ఎన్‌హెచ్-42) పెండింగ్ భూ సేకరణ, పరిహార భూ పంపిణీ వేగవంతం చేయాలన్నారు. సమీక్షలో రాయచోటి, మదనపల్లి ఆర్‌డిఒలు రంగస్వామి, మురళీ, సంబంధిత తహశీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

సిపిఎం-సిపిఐ రాజకీయ ప్రచార భేరిలో నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సిపిఎం, సిపిఐ నాయకులు పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక శ్రామిక వ్యతిరేక, అప్రజాస్వామిక విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిని రాజకీయ ప్రచార భేరి మంగళవారం నాలుగో రోజు సాగింది. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ దేశ ప్రజాస్వామ్యం రాజ్యాంగం బిజెపి పరిపాలనలో ప్రమాణంలో పడిందని తెలిపారు. అన్నదమ్ముల కలిసిమెలిసి ఉండవలసిన దేశ ప్రజల మధ్య బిజెపి ఆర్‌ఎస్‌ఎస్ కూటమి మత విద్వేషాలను చిచ్చు రాజేస్తుందన్నారు. అంబాని, అదానీలకు దేశ సంపదను దోచిపెడుతున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి, గ్యాస్ కరెంట్ బిల్, పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిపోతూ ప్రజల బ్రతికే కష్టమైందన్నారు. గ్రామీణ పేదలకు ఆసరాగా ఉన్న ఉపాధి హామీని సైతం అటకెక్కించిందని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు ప్రజా సమస్యలను పరిష్కరించకుండా బడా పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్పొరేట్ పెట్టుబడిదారులకు లాభాలు ప్రజలపై భారాలు వేస్తూ పరిపాలన కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం, జనసేన వంటి పార్టీలు బిజెపి విధానాలను వ్యతిరేకించకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సిపిఎం నియోజకవర్గ కార్యదర్శి రామానుజులు, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు విశ్వనాథ నాయక్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్, రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు, డిసిహెచ్‌ఎస్ జిల్లా కార్యదర్శి సుధీర్, రైతు సంఘం జిల్లా నాయకులు రంగారెడ్డి, మహిళా సమాఖ్య సుమిత్ర, అగిరిజన సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షులు అశోక్, ఎఐటియుసి వెంకటేష్ పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :**ప్రధాని నరేంద్ర మోడీ ముస్లిముల వ్యతిరేకి అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్వేలి రవికుమార్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి శివరామకృష్ణదేవరా అన్నారు. ప్రచార భేరి కార్యక్రమాన్ని తాళ్లపాక గ్రామ పంచాయతీలోని ఎల్లాగడ్డలో నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ఎండగడుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి పాలనలో ముస్లింలపైన దాడులు అధికమయ్యాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ముస్లిం, మైనార్టీలను ఒంటి కన్నుతో చూస్తోందని, నిత్యము వారిపై ఏదో ఒక ప్రాంతంలో దాడులకు పాల్పడుతూ వివక్షకు గురిచేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు షేక్ హుస్సేన్, బాదుల్లా, చాన్ బాష పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** ఎన్టీఆర్ సర్కిల్ నుండి ప్రభుత్వాసుపత్రి వరకు కరపత్రాలు పంచుతూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు కృష్ణప్ప మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం దేశంలో ఆర్థిక అరాచకాలను కొనసాగిస్తుందని తెలిపారు. మతం పేరుతో రాజకీయాలు నడుపుతూ రాజకీయ పబ్బం గడుపుకొంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఐ మదనపల్లి నియోజకవర్గ కార్యదర్శి కె.మురళి, నాయకులు తిరుమల, నాగమ్మ పాల్గొన్నారు. **ఓబులవారిపల్లి :** మండల పరిధిలోని బాల్‌రెడ్డిపల్లె పంచాయతీ నుండి ఇంద్రానగర్, తిరుగుడుపల్లి, ఎర్రగుంటకోట, అద్దుపల్లి ఎస్టఇ కాలనీ, చలంపాలెం, కొర్లకుంట గేటు వరకు సిపిఎం, సిపిఐ నాయకుల అధ్వర్యంలో పాదయాత్ర చేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సి.హెచ్.చంద్రశేఖర్, సిపిఐ నియోజకవర్గం కార్యదర్శి జ్యోతి చిన్నయ్య మాట్లాడుతూ ప్రభుత్వం మతాల పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెట్టి బిజెపి రాజకీయ లబ్ది పొందాలని చూస్తుందని తెలిపారు. బిజెపి కుట్రలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత కమ్యూనిస్టులపై ఉందని చెప్పారు. డిహెచ్‌పిఎస్ జిల్లా నాయకులు దార్ల నాగేశ్వరరావు, సిపిఎం మండల నాయకులు జయరామయ్య. సిపిఐ ఓబులవారిపల్లి మండల కార్యదర్శి చింతలపూరి నాగమ్మ, నాయకులు శివయ్య, హరి, చంగయ్య, కెవిపిఎస్ మండల కార్యదర్శి నాగిపోగు పెంచలయ్య, సిఐటియు నాయకులు కేశవులు పాల్గొన్నారు



రాయచోటి : ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



ఓబులవారిపల్లె : పాదయాత్ర ద్వారా ప్రచారం చేస్తున్న నాయకులు



ఆర్‌టిసి డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

దుకాణ యజమానులపై చర్యలు తీసుకోవాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఆర్‌టిసి బస్టాండ్‌లో టెండరు ద్వారా గదులు దక్కించుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని, అధిక ధరలకు విక్రయిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఆర్‌టిసి బస్టాండ్‌లో దుకాణదారులు బయట ప్రాంతాల కంటే అధిక ధరలు వసూలు చేస్తున్నారని, ఎంఆర్‌పికే ధరలకే విక్రయించాలని అడిగితే ప్రయాణికులపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని తెలిపారు. తాగునీరు లీటరు ఎంఆర్‌పి ధర రూ.20 ఉండగా రూ. 25 నుండి రూ.30 లకు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. ఐఎస్‌ఐ మార్కు గల కంపెనీల నీటి సీసాలను కాకుండా స్థానికంగా లభించే నీటి సీసాలనే ఎక్కువగా విక్రయిస్తున్నారని విమర్శించారు. ప్రయాణికులకు అధిక ధరలకు విక్రయిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంపై అనుమానం వ్యక్తం చేశారు. డిపో మేనేజర్ జోక్యం చేసుకుని అధిక ధరలకు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు, నాయకులు నరసింహ, జాన్ ప్రసాద్, కార్తీక్, రమణ పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన 'మండిపల్లి'

ప్రజాశక్తి - రాయచోటి

కడప జిల్లా పర్యటనలో భాగంగా జోన్ ఫోర్ మీటింగ్‌కు విచ్చేసిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును రాయచోటి టిడిపి నియోజకవర్గ నాయకుడు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మంగళవారం తమ అనుచరులతో వెళ్లి కడప విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాయచోటిలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితుల గురించి ఆయనకు వివరించారు అనంతరం కడప టౌన్ పులివెందుల రోడ్‌లో జరిగిన జోన్ 5 మీటింగు వెళ్లారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మదన్, కొండారెడ్డి, రాజు పాల్గొన్నారు.

పుష్పగిరి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - వల్లూరు

పవిత్ర పుణ్యక్షేత్రం దక్షిణ కాశీగా పిలవబడే పుష్పగిరి క్షేత్రంలో మంగళవారం వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి, శ్రీ కామాక్షి వైద్యనాథేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజ, అఖండ దీపారాధన, అంకురార్పణ నిర్వహించారు. సాయంత్రం పుట్టమన్ను తీసుకొచ్చి శాస్త్ర షోత్తరంగా ఆలయ అర్చకులు మేదిని పూజ నిర్వహించారు. దీంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

శిక్షణ కేంద్రం అభివృద్ధికి వినతి

ప్రజాశక్తి - రాయచోటి

స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యకలాపాలకు కేంద్రంగా ఉన్న హార్సిలీ హిల్స్‌లోని ప్రాంతీయ శిక్షణ కేంద్రం (రీజనల్ ట్రైనింగ్ సెంటర్) అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గిరీష పిఎస్‌కు మంగళవారం స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్కౌట్ అధికారులు ఆయన కార్యాలయంలో కలిసి విన్నవించారు. దాదాపు 60 సంవత్సరాల నుంచి పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనా డులతో పాటు రాయలసీమ జిల్లాలలోని స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యా ర్థులకు పర్వతారోహణ, ట్రెక్కింగ్ వంటి అంశా లలో శిక్షణ ఇవ్వడానికి ఈ ప్రాంతీయ శిక్షణ కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలియ జేశారు. శిక్షణ కేంద్రంలో ప్రస్తుతం ఉన్న భవ నాలు కూలిపోయే దశలో ఉన్నందున నూతన భవనాల నిర్మాణానికి, సుందరీకరణకు అవస రమైన చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. ప్రాంతీయ శిక్షణ కేంద్రం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి అవసరమైన ఇసుక, కంకర కింది నుండి హార్సిలీ హిల్స్‌కు చేర్చడానికి అనుమతి మంజూరు చేయాలని విన్నవించారు. సామాజిక సేవ, దేశ భక్తి, క్రమశిక్షణను విద్యార్థులలో పెంపొందించడంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ తోడ్పడుతుందన్నారు. రిపబ్లిక్ డే పేరేడ్ లో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ప్రదర్శించిన కవాతు పలువురిని ఆకర్షించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, సీనియర్ గైడ్ కెప్టెన్ శకుంతల, జిల్లా అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర, స్కౌట్ మాస్టర్లు మార్ల ఓబుల్‌రెడ్డి, బచ్చల శ్రీనివాసులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు మెడల్ వేస్తున్న శ్రీనివాసరావు

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు : ఎమ్మెల్యే



వార్డుల్లో పర్యటిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు అని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని 12వ సచివాలయం, 19 వార్డు పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మీపురం, దూదేకులపల్లె, సరస్వతి వీధి, గాలివీడు రహదారి మార్గాల్లో ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా ఇంటింటికెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలును వివరిస్తూ, ప్రజా సమస్యలపై శ్రీకాంత్‌రెడ్డి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విప్లవాత్మక మార్పులతో జగన్ పాలన సాగుతోందన్నారు లక్ష్మీపురంలో అన్ని రకాలుగా మౌలిక వసతులను కల్పిస్తామని ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దుతామని చెప్పారు. భివృద్ధి పనులుపైన, సమస్యలపైన చర్చించారు. మేజర్ స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భూగర్భ డ్రెయినేజీ, రహదారుల నిర్మాణాలును చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష,వ వార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, కౌన్సిలర్ జయన్న నాయక్, భాస్కర్, పల్లా రమేష్, మాజీ కౌన్సిలర్ ఆనంద రెడ్డి, ఆర్ట్స్ శంకర్, రవిరాజు పాల్గొన్నారు.

ఎస్‌పిని మర్యాద పూర్వకంగా కలిసిన ఎంఆర్‌పిఎస్ నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి

నూతన ఎస్‌పి గంగాధరరావును ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు రామాంజనేయులు మంగళవారం ఎస్‌పి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎస్‌పితో మాట్లాడుతూ దళితులు, బడుగు బలహీనవర్గాలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, వెంటనే స్పందించి తగు న్యాయం అందించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎస్‌పి చట్ట ప్రకారం చర్యలు తీసుకుని న్యాయం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు అశోక్ కుమార్ మాదిగ, వడ్డెర వంతులు వేదిక నాయకులు మారుతి శంకర్, శ్రీరాములు పాల్గొన్నారు.

'జన సురక్ష పథకాలపై విస్తృత ప్రచారం'

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లాలో 'జన సురక్ష' పథకాలపై గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో 'జిల్లాలో గ్రామస్థాయి జనసురక్ష' కార్యక్రమం అమలులో భాగంగా ఎల్‌డిఎం ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కన్సల్టేటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశానుసారం జిల్లాలో గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఇందులో భాగంగా పిఎంజెజెబివై, పిఎంఎసిబివై పథకం ప్రయోజనాలపై ఏప్రిల్ ఒకటి నుండి జూన్ 30 వరకు మూడు నెలల పాటు జిల్లాలో విస్తృత ప్రచారం నిర్వహించేందుకు తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులకు, బ్యాంకర్లకు సూచించారు. ఈ పథకం గ్రామస్థాయి వారికి ఎంతో ఉపయోగకరమన్నారు. అనుకోని సంఘటనలు, ప్రమాదాలలో మృతి చెందినా లేదా గాయపడితే పరిహారం అందుతుందన్నారు. పిఎంజెజెబివై కింద 18-50 సంవత్సరాల వయసు గలవారు అర్హులని, వార్షిక చందా 436 రూపాయలు కడితే ఎలాంటి మృతి సంభవించినా రూ.2 లక్షలు పరిహారం అందుతుందన్నారు. అలాగే పిఎంఎసిబివై కింద 18-70 సంవత్సరాల వయసు గలవారు అర్హులని, వార్షిక చందా కేవలం 20 రూపాయలు కడితే ప్రమాదంలో మృతి చెందినా లేదా పూర్తి అంగవైకల్యం కలిగితే రూ.2 లక్షలు పరిహారం, పాక్షిక వైకల్యం ఏర్పడిన వారికి రూ.ఒక లక్ష వరకు పరిహారం అందుతుందన్నారు. నిరుపేదలకు ఈ పథకం ఎంతో ఉపయో గపడుతుంది. గ్రామ స్థాయిలో పథకాల కింద ఎక్కువ మందిని నమోదు చేయాలని చెప్పారు. ఇందుకు బ్యాంకర్లకు, అధికారులకు అప్ప గించిన బాధ్యతలను పక్కాగా అమలు చేయాలన్నారు. కార్య క్రమం విజయవంతం కోసం తరచూ డిఎల్‌సిసి సమావేశాలు నిర్వహించాలని, వాటి నిర్వహణకు వివిధ బ్యాంకర్లతో సమన్వయం చేసుకోవాలని ఎల్‌డిఎంను ఆదేశించారు. బ్యాంకుకు కేటాయించిన ప్రదేశాల్లో క్యాంపులు ఏర్పాటు చేయాలని, రెండు స్కీమ్‌ల కింద ఉన్న అన్ని దరఖాస్తులను మే 31 వరకు స్వీకరించి జూన్ 1 నుంచి ప్రీమియం డెబిట్ చేయడం ప్రారంభించాలని బ్యాంకు కంట్రోలర్లకు సూచించారు. ప్రతి పంచాయతీలో బ్యాంకు క్యాంపులు నిర్వహించేలా సమన్వయం చేయాలన్నారు. అలాగే సచివాలయం వారీగా లక్ష్యాన్ని కేటాయించాలన్నారు. జిల్లాలో ఈ పథకాన్ని విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, డిపిఒ ధనలక్ష్మి, ఎల్‌డిఎం వెంకటేశ్వర్లరెడ్డి, వివిధ బ్యాంకుల కంట్రోలర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఒ రంగనాథయ్య

పనులు పారదర్శకంగా చేపట్టాలి : ఎంఇఒ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని నాడు-నేడు పనులపై ఎంఇఒ, ఎపిఎం మండల సమైక్య కేంద్రంలో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంఇఒ రంగనాథయ్య మాట్లాడుతూ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మార్చేందుకు మనబడి, నాడు-నేడు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారని అన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ నాడు-నేడు కింద దశలవారీగా అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నారని తెలిపారు. రెండో విడతలో ఆయిదు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 20 ప్రాథమిక పాఠశాలలు ఎంపికయ్యాయని అన్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయులకు, సిఆర్‌పిలను ఆదేశించారు. కొన్ని పాఠశాలల్లో అదనపు గదులు మంజూరు కావడం జరిగిందని వాటిని కూడా త్వరగా గదిని పూర్తి చేయాలని తెలిపారు.

'మళ్లీ వైసిపిదే అధికారం'

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి ఆదేశాల మేరకు మండల జెసిఎస్ ఇన్‌ఛార్జి రెడ్డిహరి సూచన మేరకు పట్టణంలోని నాలుగో సచివాలయ పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. మెగా సర్వేలో ప్రజా అభిప్రాయ సేకరణ చేస్తూ వారి ఆమోదంతో ఇంటింటికి స్టిక్కర్ అతికించి, జగనన్నకు మిస్డ్‌కాల్ ఇవ్వాలని కోరారు. సచివాలయ కన్వీనర్లు కలిచి కళ్యాణ్‌కుమార్ రెడ్డి, హౌసింగ్ సొసైటీ ఉపాధ్యక్షుడు సురేందర్ రెడ్డి, గృహసారధులు జనార్దన్, వాణి, వైసిపి నాయకులు బొమ్మసాని నవీన్, మధుకర్ రెడ్డి, వినోద్, వర, ముజా, బాబా, వాలంటీర్లు, మనోజ్ కుమార్, అంజని, ఆయేషా పాల్గొన్నారు. **కలకడ :** రానున్న ఎన్నికల్లో మళ్లీ వైసిపినే అధికారంలోకి వస్తుందని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ తెలిపారు. మంగళవారం గుర్రం కొండ మండలంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి పథకాలు ఆకర్షితులై ప్రజలు మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్మోహన్‌రెడ్డి చేసేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. పీలేరు నియోజకవర్గం అభివృద్ధి జరిగినట్లు మరెక్కడ జరగలేదని ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి శ్రమ ఫలితమే అభివృద్ధికి నిదర్శనమన్నారు.



పేద ముస్లింలకు ఆర్థికసాయం చేస్తున్న ఎజాస్‌ఖాన్

పేదలకు సాయం గొప్ప భాగ్యం

ప్రజాశక్తి-చిన్నమండెం

రంజాన్ మాసంలో పేదలకు సాయం చేయడం గొప్ప భాగ్యమని ప్రముఖ పారిశ్రామిక వేత్త ఎజాస్‌ఖాన్ పేర్కొన్నారు. రంజాన్ సందర్భంగా పేదలకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేసి, స్థానిక ముస్లిం మత పెద్దలకు, పేద ముస్లింలకు ఆర్థిక సాయం అందించారు. ఎజాస్‌ఖాన్‌ను కలిసిన మత బోధకుడు సిరాజ్ రెహ్మాన్, సిరాజ్ రెహ్మాన్ మాట్లాడుతూ పేద ముస్లింలకు దానం చేయడం ఎంతో గొప్ప విషయం అన్నారు. మానవతా దృక్పథంతో ఎజాస్‌ఖాన్ చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ప్రతి ఒక్క ముస్లిం తన శక్తి కొలది పేదవారికి దానం చేసి దేవుడు చూపించిన మార్గంలో నడవాలని ముస్లిం మత పెద్దలు పేర్కొన్నారు. ఎజాస్ ఖాన్ మాట్లాడుతూ ఇస్లాం మతంలో రంజాన్ నెలకు చాలా ప్రాముఖ్యత ఉంటుందని ఈ మాసంలో దానధర్మాలకు, ఉపవాస దీక్షలు చేయడంతో శరీరం, మనసులోని మలినాలు ప్రక్షాళన కావడంతో పాటు, సర్వపాపాలు దహించుకుపోతాయని ప్రతి ఒక్క ముస్లిం విశ్వసిస్తారన్నారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు, మతపెద్దలు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ సిహెచ్.నారాయణ

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-కలకడ

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు ఎంపిడిఒ సిహెచ్.నారాయణ తెలిపారు. మండలంలోని బాలయ్య గారిపల్లె పంచాయతీ మొరవపల్లెలో తాగునీటి సమస్య ఉన్నట్లు ప్రజలు తమ దృష్టికి తేవడంతో వెంటనే స్పందించి గ్రామంలో విచారించినట్లు తెలిపారు. తాగునీటి సమస్య ప్రస్తుతానికి లేదని, విద్యుత్తు సౌకర్యం సరిగ్గా లేనందున సమస్య ఏర్పడుతుందని తెలిపారు. ఈ గ్రామం సింగిల్ ఫేస్ స్కీమ్ బోరుతో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ ఆ గ్రామానికి ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్ రైతులకు, స్కీం బోరుకు ఒక్కటే ఉండడంవల్ల నీటి సమస్య తలెత్తిందని అన్నారు. కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ కమలాకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నందిని, విద్యుత్ శాఖ జెఇ లోకేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోక్స్ క్రియేటివిటీ రాష్ట్ర డైరెక్టర్‌గా నిర్మలాదేవి

ప్రజాశక్తి-కలకడ

ఆంధ్రప్రదేశ్ పోక్స్ క్రియేటివిటీ రాష్ట్ర డైరెక్టర్‌గా జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు చిదంబరరెడ్డి సతీమణి నిర్మలాదేవిని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి నియమించారు. ఈ పదవిలో ఆమె రెండు సంవత్సరాలు ఉంటారు. మరకు ఈ అవకాశం ఇచ్చినందుకు ముఖ్యమంత్రికి, ఎంపీ మిథున్‌రెడ్డికి, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డికి, సిఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.



పోక్స్ క్రియేటివిటీ డైరెక్టర్ నిర్మలాదేవి

నేడు రంజాన్ తోఫా పంపిణీ

గాలివీడు : గిడ్డర రెడ్డమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో రంజాన్ సందర్భంగా మైనార్టీ కుటుంబాలకు గోపనపల్లె, పేరంపల్లె గ్రామాల్లోని మైనార్టీ కుటుంబాలకు బుధవారం మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రంజాన్‌తోఫా పంపిణీ చేయనున్నట్లు గిడ్డర ఈశ్వర్‌రెడ్డి, గిడ్డర ధర్మారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

పెద్దమండ్యం : మండలంలోని కలిచర్ల గ్రామ పంక్షన్‌హాల్‌లో బుధవారం ఎమ్మెల్యే ద్వారకానాథ్‌రెడ్డి మండల ప్రజలతో సమావేశం నిర్వహించనున్నారు. సమావేశానికి మహిళలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మహిళా సాధికారతే సిఎం లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- కురబలకోట

మహిళా సాధికారతే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అంగళ్లు సమీపంలో ఉన్న కెఎంఆర్ కల్యాణ మండపంలో నిర్వహించిన ఆసరా చెక్కులు పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రగతిపథంలో డ్వాక్రా సంఘాలు ప్రభుత్వం చేపట్టిన చర్యలు, పథకాల అమలు కారణంగా పొదుపు సంఘాల ఆర్థికవృద్ధి పెరిగిందన్నారు. గత ప్రభుత్వ పాలనలో నిర్వీర్య దశలో ఉన్న పొదుపు సంఘాలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలు జీవం పోశాయని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో 18 శాతం సంఘాలు ఒవర్ డ్యూస్‌గా ఉంటే మన ప్రభుత్వంలో 0.45 శాతానికి తగ్గాయన్నాని చెప్పారు. మహిళలకు పదవుల్లో 50శాతం రిజర్వేషన్లు, మహిళల రక్షణకు దిశ యాప్, మహిళల పేరుతో ఇళ్లస్థలాలు, పక్కాగృహాలు మంజూరు, పేదరిక నిర్మూలనకు ఆసరా, చేయూత, సున్నావడ్డీ పథకాల అమలుతో మహిళలకు మంచి జరుగుతోందన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపిడిఒ దిలీప్, ఎంపిపి దస్తగిరి,



వైఎస్ఆర్ ఆసరా చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మార్కెట్ కమిటీ చైర్మెన్ డి.ఆర్ ఉమాపతిరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, ఆర్‌కె.కృష్ణారెడ్డి, ఆర్‌బికె చైర్మన్ శివశంకర్ రెడ్డి, కులదీప్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది మల్లికార్జున,చంద్ర కళ, ఎంపిఎం నీరజ ,వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి అసమర్థపాలనతో ప్రజలకు ఇబ్బందులు : ఆర్‌ఆర్



ఇదేంఖర్మ కార్యక్రమంలో రమేష్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లె

వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సాగిస్తున్న అసమర్థ పాలనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలో మద్దిరేవుల పంచాయతీ జిఎంఆర్ కాలనీ, మర్లవాండ్ల పల్లె, సోమలవాండ్లపల్లిలో నిర్వహించిన ఇదేంఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో సాగిస్తున్న తుగ్లక్ పాలన సాగిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నవరత్నాల పేరుతో ప్రజలను మోసం చేస్తోందని, ఎక్కడా అభివృద్ధి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించకపోతే రాష్ట్రం పదేళ్లు వెనక్కి వెళ్ళిపోతుందని అన్నారు.రాష్ట్ర పాలన మంచిగా సాగాలంటే చంద్రబాబు సిఎం కావాలని, 2024 ఎన్నికల్లో ప్రతి ఒక్కరు టిడిపికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కలాడి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపిపి ఉమాపతిరెడ్డి, ఆంజనేయులు, దిలీప్‌రాజు, రవిరెడ్డి, భూసనం, కుమార్, సర్పంచ్ చంద్రమ్మ, శేఖర్, సర్పంచ్ చంద్రాయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటిద్దాం

ప్రజాశక్తి- కలకడ

వడదెబ్బ బారిన పడకుండా గ్రామీణ ప్రాంత ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి యంవి.కిషోర్ కుమార్ రెడ్డి సూచించారు. మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నవాబుపేట గ్రామపంచాయతీలో వైద్యాధికారి ఆధ్వర్యంలో ఫ్యామిలీ పిజిషన్ కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమం గురించి వైద్యాధికారి మాట్లాడుతూ అసంక్రమమైన వ్యాధులు బిపి, షుగర్‌కు స్క్రీనింగ్ చేయాలని తెలిపారు. 60 సంవత్సరములు పైబడిన వృద్ధులు, ఐదేళ్లలోపు లోపు పిల్లలు, గర్భిణులు ఎండ తీవ్రతకు గురికాకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉదయం 10 గంటల లోపు సాయంత్రం నాలుగు గంటల తర్వాత పొలం పనులకు వెళ్లాలని వెళ్లేటప్పుడు గొడుగు, మజ్జిగ, వాటర్ బాటిల్, చేతి రుమాలు, తప్పక తీసుకెళ్లాలని అన్నారు. జనరల్ ఒపి 65 మంది, ఇద్దరు గర్భిణులు, నలుగురు బాలింతలు, 12 మందికి కీళ్ల నొప్పులకు వైద్య పరీక్షలు చేశామని తెలిపారు.కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జి.జయరామయ్య, ఎంపిహెచ్ఎస్,



నవాబుపేటలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ కిషోర్ కుమార్ రెడ్డి

ఎస్.ముజీబ్ బాషా. బి.రెడ్డమ్మ, ఎంఎల్‌హెచ్‌పి కనకమ్మ, ఆరోగ్య కార్యకర్త భాగ్యమ్మ, శివప్రసాద్‌బాబు, డేటా ఎంట్రీ ఆపరేటర్ రోజా, పైలట్ రమేష్ బాబు, ఆశ కార్యకర్త సి.అనంతరాణి పాల్గొన్నారు.

మసీదు మరమ్మతులకు విరాళం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణపరిధిలోని పోతబోలులో మసీదు నిర్వహణ, మరమ్మతులు, రంజాన్ పండుగ సందర్భంగా రంగులు వేయడానికి రూ.10 వేలు జనసేన పార్టీ రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామదాస్ చౌదరి ముస్లిం మత పెద్దలకు అందించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేనపార్టీ అధినేత పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో మసీదుల అభి వృద్ధి కోసం ఇటీవల రూ.25 లక్షల రూపాయలు విరాళంగా అందించారని తెలిపారు. కార్య క్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి శివరామ్‌రాయల్, చేనేత విభాగం రాష్ట్ర ప్రదాన కార్యదర్శి అడపా సురేంద్ర, ఐటి విభాగం జగదీష్, జిల్లాకార్యదర్శి సనాఉల్లా, రామ సముద్రం మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, కుమార్, రెడ్డెమ్మ, స్వాతి, పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండంలోని చీకల బైలు పంచాయతీ బెంగళూరు రోడ్డు పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో అధికార పార్టీ నాయకుల పేరు చెప్పి ఇంటి నిర్మాణం చేపట్టిన వ్యక్తిని గ్రామస్తులతోపాటు జడ్‌పి హైస్కూల్ సిబ్బంది అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సంఘటన స్థలానికి చేరుకొని పాఠశాలకు కేటాయించిన ప్రభుత్వ స్థలంలో ప్రయివేట్ వ్యక్తులు ఎవ్వరూ నిర్మాణాలు చేపట్టకూడదని అన్నారు. నిర్మాణాలు చేపడితే గ్రామస్తుల ఆగ్రహానికి గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు. సచివాలయ విఆర్ఒ రెడ్డిరాణి, సర్వేయర్ సురేష్‌లు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న రమేష్‌ను ఇంటి నిర్మాణం చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైతు సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ధ్యేయమని వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన జడ్‌పిటిసి సభ్యులు పి.రత్నమ్మతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పసుపును అమ్ముకునే రైతులకు సిఎం రైతు భరోసా కేంద్రాలలో నమోదు చేసుకుని వారికి క్వింటాకు రూ.6,850 ఇస్తున్నారని అన్నారు. సోమవారం తిరుపతి వ్యవసాయ కళాశాలలో ఐదు జిల్లాలకు సంబం ధించిన శాస్త్రవేత్తలతో అరటి, బొప్పాయి, మామిడి తదితర పంటలకు వచ్చే వైరస్ తెగుళ్లపై ప్రత్యేక అవగాహన సమావేశాన్ని నిర్వహించారని చెప్పారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని సంపాదించే విధంగా క్రిమిసంహారక మందులు నివారించే విషయాన్ని శాస్త్రవేత్తలు రైతులకు సూచించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ అధికారులు ఉద్యాన అధికారులు అందుబాటులో తెగుళ్ల నివారించే చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో చంద్ర పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మదనపల్లి అగ్నిమాపక కేంద్ర అధికారి కె.మాబుసుభాన్ ఆధ్వర్యంలో ఐదవ రోజు పట్టణంలోని బసిని కొండ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ఆపోజిట్ రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూమ్ వద్ద అగ్ని ప్రమాదాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసి కరపత్రాల పంపిణీ చేశారు. మాక్ డ్రిల్ నిర్వహించి అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి, ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యల గురించి వివరించారు. ప్రమాదం జరిగినప్పుడు అగ్నిమాపక కేంద్రమునకు సమాచారం అందించాలని 101, 08571 222101, 9963735597 నంబర్లకు సమాచారం తెలపాలని కోరారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి-గాలివీడు

గాలివీడు సచివాలయ సెక్రెటరీ రాధికారెడ్డి మంగళవారం బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం వండిన వంటకాలను రుచి చూసి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బిసి బాలికల వసతి గృహానికి చేరుకొని అక్కడ విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్నం భోజనం మెనూ ప్రకారం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో అసౌకర్యాలు ఉంటే తెలపాలని కోరారు. కార్యక్రమంలో ఎఎన్ఎం ఆనంద్, జ్యోతి పాల్గొన్నారు.

సిబ్బంది కొరతతో ఇబ్బందులు

గాలివీడు : సిబ్బంది కొరతతో పోలీసు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఒక ఎస్ఐతో పాటు 21 మంది పిసిలు, ఇద్దరు ఎఎస్ఐలు, ఆరుగురు హెడ్ కానిస్టేబుల్ ఆరు మంది ఉండాల్సి ఉంది. సిబ్బంది కొరత వల్ల అన్ని పనులు ఒకరే చేసే పరిస్థితులు ఏర్పడే విధంగా ఉన్నాయి. సిబ్బంది కొరతతో స్టేషన్ ఖాళీగా ఉండే పరిస్థితి ఏర్పడింది. స్టేషన్‌కు తగిన సిబ్బందిని ఏర్పాటు చేసి శాంతి భద్రతలను కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఎస్ఐపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రాజ్యాంగ నిర్మాత డాక్టర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన బ్యానర్లును తొలగించడమే కాకుండా, ప్రశ్నించిన దళిత యువకులపై దాడి చేసిన ఎస్ఐ పైన దాడిలో పాల్గొన్న పోలీస్ సిబ్బందిపైన ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి కేసు నమోదు చేసి, వారిని సస్పెండ్ చేయాలని డివిఎంసి చైర్మన్ కె.వి.రమణ, బాస్ జిల్లా కార్యదర్శి సింగన్న డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ బ్యానర్లు ఎవరు ఏర్పాటు చేసినా తొలగించకూడదని, రాజ్యాంగ బద్ధమైన విధులు నిర్వర్తిస్తూ ఆరాజ్యాంగాన్ని కాపాడవలసిన ఎస్ఐ అలా ప్రవర్తించడం హేయనీమన్నారు.

కార్మికులకు నిత్యావసర సరుకులు

ప్రజాశక్తి-కలకడ

పంచాయతీ కార్మికులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ సిహెచ్ నారాయణ తెలిపారు. మండల కేంద్రమైన కలకడ సచివాలయం పరిధిలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులకు నిత్యవసర సరుకులు నూనె, సబ్బులు, యూనిఫారంలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఏడాదిలో రెండు పర్యాయాలు పంచాయతీ కార్మికులకు పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ కమలాకర్‌రెడ్డి, వైసిపి నాయకులు షావత్‌అలీఖాన్, పంచాయతీ కార్యదర్శి నందిని, పంచాయితీ కార్మికులు పాల్గొన్నారు.

ఎస్‌డిజి సర్వే సక్రమంగా పూర్తిచేయాలి

తంబళ్లపల్లి : ప్రభుత్వం తలపెట్టిన అమలుపరుస్తున్న ఎస్‌డిజి సర్వేలో సక్రమంగా పూర్తి చేయాలని ఎంపిడిఒ ఆనంద్ కుమార్ ఆదేశించారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ వెల్ఫేర్ అసిస్టెంట్‌లు డిజిటల్ అసిస్టెంట్‌లతో సమన్వయంతో పని చేసి సర్వేను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

రంజాన్ పురస్కారాల ప్రదానం

పీలేరు : తిరుపతి జిల్లా, రేణిగుంటలో ఎంఎ జబ్బార్ ట్రస్ట్ నిర్వాహకులు షేక్ ఫరీద్ బాబా రంజాన్ మాసం పురస్కారాలను ప్రదానం చేశారు. మంగళవారం రేణిగుంటలోని మంచినీళ్ల గుంట సమీపంలో ఉన్న ట్రస్ట్ కార్యాలయం వద్ద 'లైలతుల్ ఖద్ర్' (బఢీ రాత్) సందర్భంగా ఆయన ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఫరీద్ బాబా వివిధ రంగాల్లో నిష్ణాతులైన 11 మంది సాహితీవేత్తలు, కళాకారులు, నిపుణులకు దుశ్శాలువా కప్పి, పూలమాల, జ్ఞాపికను బహూకరించి ఘనంగా సత్కరించారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ నాటి రాజుల కాలంలో కవులు, కళలు, కళాకారులకు ఎంతో ప్రోత్సాహం ఉండేదని అన్నారు. ఆదరణ కరువౌతున్న ఈ కాలంలో ఫరీద్ బాబా నేటి తరం సాహితీ ప్రియుడు, కళాపోషకుడుగా, కుల, మతాలకతీతంగా, వివిధ రంగాలకు చెందిన ఎంతోమందిని వివిధ సందర్భాల్లో సన్మానిస్తూ, సత్కరిస్తూ అర్హులైన వారికి ఎన్నోసేవా కార్యక్రమాలను ఆనవాయితీగా అందిస్తూ ఉన్నారని చెప్పారు. సంప్రదాయ రీతిలో సన్మానం అందుకున్న 11 మంది ప్రముఖుల్లో తిరుపతికి చెందిన సీనియర్ కళాకారుడువాసు, సీనియర్ రంగస్థల కళాకారుడు, నంది అవార్డుల న్యాయనిర్ణేత జంగం ధర్మారావు, బుల్లి, వెండితెర నటుడు గుల్జార్ గౌస్, శ్రీకాళహస్తికి నృత్య దర్శకురాలు ఆష, అంతర్జాతీయ బహుభాషా రంగస్థలం, బుల్లి, వెండితెర కళాకారుడు, పీలేరుకు చెందిన షేక్ ఖాదంబాషా, రేణిగుంటకు చెందిన ఉపాధ్యాయుడు ఆర్.నరకేశరి, నెల్లూరు, చిత్తూరు జిల్లాల మార్కెటింగ్ మేనేజర్ నందకుమార్, తిరుపతికి చెందిన కంప్యూటర్ ఇంజనీర్ వై.రామకృష్ణ, టిటిడి ఉద్యోగి విజయ్ కుమార్ రెడ్డి, తిరుపతి ఏ-1 క్యాటరింగ్ నిర్వాహకులు షేక్ మస్తాన్‌లు ఉన్నారు. అనంతరం ఫరీద్ బాబా రంజాన్ మాసం సందర్భంగా వందమంది పేద ముస్లిం మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్, మధు, వాసు తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరం ఏర్పాటుచేసిన డాక్టర్ సృజన

విషజ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-నందలూరు

మండల పరిధిలోని పలు గ్రామాలలో విష జ్వరాలు నమోదవుతున్న నేపథ్యంలో అప్రమత్తమైన మండల వైద్యశాఖ ఈడిగపల్లి, మదనమోహన పురం, పోత్తపి గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ సృజన తెలిపారు. విష జ్వరాలు నమోదైన గ్రామాలలో పర్యటించి ఆయా గ్రామాలలో జ్వర పీడితులకు రక్తపరీక్షలు, రక్త పూతల సేకరణ, వైద్య పరీక్షలు, వైద్య సహాయం, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శుల సహకారంతో దోమల మందు పిచికారీ చేయించాలని, మురుగు నీటి నిల్వ లేకుండా చూడాలని ఎఎన్ఎంలను ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సిహెచ్ఒ నారాయణ, మలేరియా సబ్ యూనిట్ అధికారి స్వామిదాస్, టిబి సూపర్వైజర్ జయప్రకాష్, హెల్త్ అసిస్టెంట్ సుబ్బయ్య, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్



నిందితుడి అరెస్టును చూపిస్తున్న డిఎస్‌పి కేశప్ప

వాహనాల చోరీ కేసులో నిందితుడు అరెస్టు

-14 ద్విచక్ర వాహనాలు స్వాధీనం : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ద్విచక్ర వాహనాలు చోరీ చేసే ముఠా సభ్యుడిని అరెస్టు చేసినట్లు డిఎస్‌పి కేశప్ప తెలిపారు. మంగళవారం స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నిందితుడిని విలేకరుల ఎదుట హాజరు పరిచారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ పట్టణములో వరసగా ద్విచక్ర వాహనాలు చోరీలు జరుగుతుండగా, ఎస్పీ ఆర్.గంగాధర్ రావు ఆదేశాల మేరకు టౌన్ సిఐ మురళీకృష్ణ ప్రత్యేక టీంల ద్వారా ఏర్పాటు చేసి వారికి రాబడిన సమాచారంపై ఎపిటిజి మోహన్, సిబ్బంది కలిసి మంగళవారం అన్నమయ్య సర్కిల్ వద్ద ఒక వ్యక్తి ద్విచక్ర వాహనాలను దొంగలించుకొని పారిపోతుండగా పట్టుకొని అతనిని విచారించి, అతని వద్ద గుర్రంకొండ మండలం, సంగసముద్రం పంచాయతీ, కొత్తపల్లె అటవీ ప్రాంతంలో దాచిన 14 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుడు గుర్రంకొండ మండలం, సంగసముద్రం పంచాయతీ, కొత్తపల్లెకు చెందిన పి.కమల్‌బాషా కుమారుడు పఠాన్‌నూర్‌మొహమ్మద్(28)ను విచారించినట్లు తెలిపారు. ఇతని బంధువైన మదనపల్లె టౌన్, దేవళం వీధికి చెందిన షేక్ ఆదిడ్ హుస్సైన్ అలీ కుమారుడైన షేక్ సైపాఅలీ ఎవరికీ తెలియకుండా మోటార్ సైకిల్స్ ను దొంగతనము చేసుకొని వస్తూ ఉంటాడని, వాటిని ఇతను అమ్మి షేక్ సైపాఅలీ వద్ద కమీషన్ తీసుకుంటూ ఉంటాడని తెలిపారు. ఇందులో స్పెండర్ ప్లస్ 6, ప్యాషన్ ప్రో 8, హోండా షైన్1, మొత్తం 14 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మదనపల్లె 2టౌన్ లో10 కేసులు, తాలుకాపోలీస్ స్టేషన్ లో-12 లు కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. కేసులు నమోదు కాని రెండు మోటర్ సైకిళ్ల యజమానులు గుర్తుంచవలసి ఉందన్నారు. ఈ కేసులో ప్రతిభ చూపిన సిఐ మురళీకృష్ణ, ఎస్ఐ చంద్రమోహన్, హెడ్ కానిస్టేబుల్ శంకర్, కానిస్టేబుళ్లు మునిరత్నం, రెడ్డిప్రసాద్, భద్రానాయక్, రెడ్డిశేఖర్‌లను అభినందించారు.



నాటుసారా ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు



మాట్లాడుతున్న డిఎస్‌పి

నాటు సారా స్థావరాలపై దాడులు

4500 లీటర్ల సారా స్వాధీనం : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండల పరిధిలోని టి.నారమాకుల తాండా, చుట్టూ ప్రక్కల గ్రామాలలో నాటుసారా స్థావరాలపై దాడులు చేసి 4500 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసి, 50 కేజీల బెల్లం, తుమ్మచెక్కను స్వాధీనం చేసుకున్నామని డిఎస్‌పి కేశప్ప తెలిపారు. మంగళవారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌పి, ఎఎస్‌పి ఆదేశాల మేరకు మదనపల్లె ఎస్‌డిపిఒ, ఎఇబి డిఎస్‌పి పర్యవేక్షణలో రూరల్ సిఐ, ఎస్ఐ, స్పెషల్ పార్టీ సిబ్బందితో టి.నారమాకుల తాండా, చుట్టు ప్రక్కల గ్రామాలలో తనిఖీలు చేశామన్నారు. పోలీసు రాకను గమనించి ఒక సారా బట్టి వద్ద కట్టెలను ఎవరో నిప్పు పెట్టి ఉండగా సుమారు 500 కేజీల బెల్లం మంటలలో కాలుతూ కనబడినదన్నారు. గ్రామంలో నాకాబంది నిర్వహించామన్నారు. వాహనాలను పరిశీలించి, రికార్డు సరిగా లేని రెండు మోటార్ సైకిళ్లను, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు. నాటు సారా తయారు చేసినా, అమ్మినా ఖచ్చితంగా క్రిమినల్ కేసు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ముడి సరుకు తుమ్మ చెక్క, బెల్లం, పండ్ల తొక్కలు మొదలైనవి ఎక్కడ తెచ్చుకుంటున్నారో విచారించి వారిపై కూడా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదంలో పశువుల కొట్టం దగ్ధం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

అగ్ని ప్రమాదంలో గొర్రెల గొట్టం వ్యవసాయ బోర్ల వద్ద పైపులు, డ్రిప్పు పైపులు, టమాటా కట్టలు దగ్ధమైన సంఘటన మండలంలో సోమవారం జరిగింది. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుండ్లపల్లెకు చెందిన జి.వెంకటనరసమ్మ గ్రామ సమీపంలోని బోరుబావి వద్ద గొర్రెల కోసం అడ్డగొట్టం నిర్మించుకున్నారు. అక్కడే ఉంటూ గొర్రెలు లను మేపుకుంటున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పులువేయడంతో గొర్రెలు గొట్టం పూర్తిగా కాలిపోయింది. కేబుల్ వైర్లు, మోటార్ స్టాటరు, పైపులు డ్రిప్పు పైపులు నాలుగు ట్రాక్టర్ల టమాటా కట్టలు అగ్నికి దగ్ధం అయ్యాయి. మల్లికార్జునకు చెందిన ట్రాక్టర్ లోడ్ టమాటా కట్టలు డ్రిప్పు పైపులు, వై.శేఖర్‌కు చెందిన ఒక లోడు టమాటా కట్టలు, జి.మల్లికార్జున నాయుడుకు చెందిన సుమారు రెండు ట్రాక్టర్ లోడ్ల కట్టలు కాలిపోయాయి. అగ్ని ప్రమాదంలో సుమారు ఆరు లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్టు తెలిపారు. అగ్ని ప్రమాదంలో జరిగిన ఆస్తి నష్టం అంచనా వేసి ఆదుకోవాలని తాహశీల్దార్ కళావతిని కోరారు.



దగ్ధమైన పశువుల కొట్టాన్ని చూపుతున్న బాధితుడు